# చెల్లింపులు మరింత సులభం



సోమవారం హైదరాబాద్‌లో ఐడీఆర్‌బీటీ సదస్సుకు ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వై.వి.రెడ్డితో కలిసి వస్తున్న ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్

## ● ఈ నెలాఖరు నుంచే యూపీఐ సేవలు ● త్వరలో ఆన్‌లైన్ రుణాలపై నిబంధనలు : రాజన్

ఈనాడు – హైదరాబాద్

**చె**ల్లింపు సేవలకు (పేమెంట్ సర్వీసెస్) ఇప్పటి వరకు బ్యాంకులే ఆధారంగా ఉండేవని, సాంకేతిక పరిజ్ఞానంలో వేగంగా వస్తున్న మార్పుల కారణంగా భవిష్యత్తులో ఈ పరిస్థితులు కొనసాగబోవని రిజర్వు బ్యాంకు గవర్నరు రఘురాం రాజన్ తెలిపారు. బ్యాంకింగేతర సంస్థలు వినూత్న చెల్లింపు ఉత్పత్తులు, సేవలను అందుబాటులోకి తెస్తున్నాయని, ఇవి బ్యాంకుల వ్యూహంపై ఒత్తిడి పెంచుతున్నాయని చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (ఐడీఆర్ బీటీ) నిర్వహించిన టెక్నాలజీ ఎక్సెలెన్స్ అవార్డుల కార్యక్రమంలోరాజన్ కీలకోపన్యాసం చేశారు. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల మధ్య పోటీని, సహకారాన్ని రిజర్వు బ్యాంకు కోరుకుంటోందని రాజన్ తెలిపారు. 'చెల్లింపు వ్యవస్థలు అందరూ వినియోగించుకునే విధంగా ఉండాలి. చౌకగా, ఏమీ తెలియని వ్యక్తి వినియోగించినా భద్రతకు లోటు ఉండకూడదు. చందాదారుడికి సమస్య తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించేదిగా ఉండాలి' అన్నారు. భద్రంగా, చెల్లింపులను మరింత సులభం చేయడానికి రిజర్వు బ్యాంకు అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు.

**వాడకం తక్కువగానే ఉంది:** ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సదుపాయాలను కలిగి ఉంటున్నా.. వినియోగ శాతం ఇంకా తక్కువగానే ఉంది. నగదు లావాదేవీల నుంచి ఆన్‌లైన్, మొబైల్ చెల్లింపులకు మారితే పన్నులు చెల్లించాల్సి వస్తుందన్న భావన ఇందుకు ఒక ప్రధాన కారణమని రాజన్ విశ్లేషించారు. అయితే.. పన్ను ఎగవేతలకు ఉన్న అవకాశాలను సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ) తగ్గిస్తోందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిపే వ్యాపారులను ప్రోత్సహించడానికి, కొన్ని పన్ను ప్రోత్సాహకాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భద్రత లేకుండా ఆన్‌లైన్ సేవలందించలేమన్నారు. ఎలక్ట్రానిక్ చెల్లింపుల్లో చందాదారుడికి నష్టం జరిగితే.. నష్టపరిహారం లభించే విధంగా త్వరలో రిజర్వు బ్యాంకు మరింత పటిష్ఠమైన నియమ నిబంధనలను రూపొందించనుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను బ్యాంకులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటున్నాయని రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ ఆర్.గాంధీ తెలిపారు.

**పరిశోధనపై దృష్టి:** బ్యాంకింగ్ రంగ అవసరాలు తీర్చడానికి పరిశోధన, అభివృద్ధిపై దృష్టి పెడుతున్నామని ఐడీఆర్‌బీటీ డైరెక్టర్ ఎ.ఎస్.రామశాస్త్రి తెలిపారు. బ్యాంకింగ్ టెక్నాలజీ పూర్తి కాలపు పీహెచ్‌డీ కార్యక్రమం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్, త్రిచితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. బ్యాంకు సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో టెక్నాలజీ వినియోగం, అనలిటిక్స్, బిగ్ డేటా, డిజిటల్ బ్యాంకింగ్ వంటి మొత్తం 10 విభాగాల్లో పెద్ద, మధ్య, చిన్న స్థాయి బ్యాంకులకు ఐడీఆర్‌బీటీ బ్యాంకింగ్ టెక్నాలజీ ఎక్సెలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఆర్‌బీఐ గవర్నర్ చేతుల మీదగా సైబర్ సెక్యూరిటీ చెక్ లిస్ట్‌ను. భారత్‌లో బ్యాంకింగ్ టెక్నాలజీ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు ధోరణులపై పుస్తకాన్ని ఐడీఆర్‌బీటీ విడుదల చేసింది.

### ఎస్‌బీహెచ్, ఆంధ్రా బ్యాంకులకు అవార్డులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్)కు 'సాంకేతిక పరిజ్ఞానం వినూత్న వినియోగం' విభాగంలో ఐడీఆర్‌బీటీ అవార్డు లభించింది. ఉత్తమ డిజిటల్ బ్యాంకింగ్, ఐటీ వ్యవస్థ నిర్వహణ విభాగాల్లో ఆంధ్రా బ్యాంకు ఈ అవార్డు పొందింది. మధ్య స్థాయి బ్యాంకుల విభాగంలో ఈ రెండు బ్యాంకులకు ఈ అవార్డులు లభించాయి. పెద్ద బ్యాంకుల కేటగిరిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 'టెక్నాలజీ ఫర్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్' అవార్డు దక్కింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో ఉత్తమ ఐటీ పరిజ్ఞాన వినియోగ బ్యాంకుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)కు అవార్డు లభించింది. ఏపీజీవీబీ ఛైర్మన్ వి.నరసి రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

### యూపీఐ సేవలు ఇలా

**బ్యాం**కుకు వెళ్లకుండానే ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు మొబైల్ ఫోను ద్వారా నగదు బదిలీకి మరింత సులువైన పద్ధతి వస్తున్నట్టు రాజన్ ఈ సదస్సులో చెప్పారు. యునైటెడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)గా పేర్కొనే సేవలు ఈ నెలాఖరుకు అందుబాటులోకి వస్తే.. ఇ మెయిల్ ఐడీ తరహాలో అక్షరాల్లో ఒక ఐడీ ఉంటుంది. యాప్‌ను ఓపెన్ చేసి పంపాల్సిన నగదు, పంపేవారి ఐడీ నొక్కితే సరిపోతుంది. నగదు బదిలీ అవుతుంది' అని రాజన్ తెలిపారు.

- ✦ ఐసీఐసీఐ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు తదితర 15 బ్యాంకులు ఈ సౌకర్యాన్ని తొలుత ప్రారంభిస్తాయి. ఈ విధానంలో గరిష్ఠంగా రూ.లక్ష బదిలీకి అనుమతిస్తారు.
- ✦ ఆన్‌లైన్‌లో రుణాలు ఇచ్చేందుకు అవసరమైన పీర్-టు-పీర్ రుణ సేవలపై త్వరలో నిబంధలు తీసుకురానున్నట్లు రాజన్ చెప్పారు. పెద్ద పెద్ద బిల్లుల చెల్లింపునకు భారత్ బిల్ పేమెంట్స్ వ్యవస్థను, చిన్న, మధ్య స్థాయి సంస్థల (ఎంఎస్ఎంఈ) ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ వ్యవస్థను తెచ్చామని గుర్తు చేశారు.

### ఏడాది చివరకు రూపే క్రెడిట్ కార్డు

నాలుగేళ్ల క్రితం రూపే డెబిట్ కార్డును ప్రవేశపెట్టిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), 2016 చివరి నాటికి రూపే క్రెడిట్ కార్డును విడుదల చేయనుంది. ప్రారంభంలో 5 బ్యాంకులు రూపే క్రెడిట్ కార్డు జారీ చేయగలవని ఎన్‌పీసీఐ ఎండీ, సీఈఓ ఎ.పి.హోటా తెలిపారు. దేశంలో 600 బ్యాంకులు జారీ చేస్తున్న రూపే డెబిట్ కార్డులు 28 కోట్లున్నాయని ఈ ఏడాది చివరికి ఈ సంఖ్య 30 కోట్లకు చేరగలని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయంగా రూపే డెబిట్ కార్డులు వినియోగించడానికి డిస్కవర్ కార్డ్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.